క్లుప్తంగా

7న చలో హైదరాబాద్

టెక్కలి: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వచ్చే నెల ఏడో తేదీన నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్నకార్యక్రమానికి పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్


శ్రావణి దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలిన శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ, బి.నగేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతోనే సార్థకత


మాట్లాడుతున్న ప్రసాదరావు

మందస: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ప్రభుత్వ లక్ష్యానికి సార్థకత చేకూరుతుందని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం, నాడు-నేడు నాన్ అకడమిక్ అధికారి గొడబ ప్రసాదరావు(సెర్ప్) అన్నారు. హరిపురం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం కోట్లాది రూపాయలు వ్యయం చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు చక్కని ప్రణాళికతో విద్యార్థుల ఉత్తీర్ణతాశాతాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. ఉన్నత విలువలతో కూడిన విద్యను అందివ్వాలన్నారు. శతశాతం ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. సమావేశంలో హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి తారకేశ్వరరావు, స్థానిక సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం, ఎస్ఎంసీ మట్ట ఖగేశ్వరరావు, కిల్లి ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సన్మానం

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డీన్‌గా పని చేసిన కె.బి.మధుసాహు, అధ్యాపకేతర సిబ్బంది టి.బి.ఎస్.మురళీకృష్ణ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఇరువురిని కళాశాల యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించి గౌరవించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద స్థానిక సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు వైఎస్సార్ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్లాది మంది దాహాన్ని తీర్చిన భగీరథునిగా చరిత్రలో నిలిచిపోయారని, అందుకే ఆయన పేరుతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన


ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోటబొమ్మాళి: చిన్న హరిశ్చంద్రపురం ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని హెచ్ఎం పి.క్రిష్ణపాప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వేసవి సెలవుల్లో పిల్లల కోసం తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన సర్పంచ్ జి.కేశవరావు, ఎంపీటీసీ సభ్యుడు బగాది దివాకర్‌లను ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు.మల్లేసు, డి.రామారావు, ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

‘జగనన్నే మా భవిష్యత్’తో ప్రజలకు మరింత చేరువ

● నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్


మాట్లాడుతున్న సమన్వయకర్త పిరియా సాయిరాజ్

సోంపేట: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రతిఇంటికి వెళ్లడం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యామని సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. ‘జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం ముగిసిన సందర్భంగా బేసిరామచంద్రాపురం గ్రామ పంచాయతీలో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం మరింత పెంచిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త తన బాధ్యతగా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. బేసిరామచంద్రాపురం పంచాయతీలో జగనన్నే మన భవిష్యత కార్యక్రమం పూర్తి చేసినందుకు కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, పార్టీ నాయకులు బుద్దాన శ్రీకృష్ణ, పొందూరు గున్నయ్య, బీన ఢిల్లీరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఇంటింటా ‘జగనన్నే మా భవిష్యత్’


కోటబొమ్మాళి: ఊడికిలపాడులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ నేతింటి అప్పలస్వామి తదితరులు


కోటబొమ్మాళి: గంగుపేటలో సచివాలయ కన్వీనర్ బమ్మిడి శ్రీనివాస్ నేతృత్వంలో..


కోటబొమ్మాళిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు తదితరులు

కోటబొమ్మాళి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిపై నిర్వహిస్తున్న ప్రజా సర్వేకు మండలంలో చివరి రోజున అనూహ్య స్పందన లభించింది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులను ప్రజలు ఆనందంతో ఆహ్వానించారు. ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేసి సంతోషం వ్యకం చేశారు. ఇంటి యజమాని అనుమతితో గోడపై ‘మా నమ్మకం నువ్వే జగన్’ స్టిక్కర్లను అతికించారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

● ఎంపీపీ బోర పుష్ప


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం శ్రమించిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని, వారి అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బోర పుష్ప అన్నారు. తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో అంబేడ్కర్, మహాత్మా గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణన్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, స్వామీ వివేకానంద విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రాథమికస్థాయి నుంచే దేశ భక్తిని పెంపొందించేందుకు పాఠశాలల్లో దేశ నేతల విగ్రహాలు ఉండటం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మేరుగు సీత, మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు, ప్రధానోపాధ్యాయులు బెండి గోవిందరావు, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెట్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, చల్ల కృష్ణారెడ్డి, మేరుగు సూర్యనారాయణ, కొంతాల కనకరాజు, కొంతాల బాలరాజు, ఆశి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమష్టి భాగస్వామ్యం అవసరం


సీఎం జగన్ సందేశాన్ని మొబైల్‌లో వినిపిస్తున్న వైస్ ఎంపీపీ నేతాజీ

కవిటి: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యుల సమష్టి భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని కవిటి వైస్ ఎంపీపీ పూడి నేతాజీ అన్నారు. విద్యా సంవత్సరం ముగింపులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. జగతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో నేతాజీ పాల్గొన్నారు. ముందుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని తల్లిదండ్రులకు మొబైల్‌లో వినిపించారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవిలో సెలవుల్లో పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల పర్యవేక్షణ, పిల్లలకు వర్క్‌షీట్స్ పూర్తిచేసేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.అర్జునుడు, సర్పంచ్ పూడి వరప్రసాద్, పి.వెంకటేశం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి: బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఇంజినీర్ ఎం.నేతాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోంపేట, కవిటి-ఈదుపురం రహదారిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేసే పనులు చేపడుతున్నట్టు చెప్పారు. దీంతో మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, వరక గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. అవసరమైతే 33 కేవీలైన్ సరఫరా ఆపాల్సి వస్తే బొరివంక ఫీడర్‌లోని అన్నిగ్రామాలకు సరఫరా నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ట్యాంకుర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ డీఈ బళ్ల హరి, ఏఈ అవినాష్, కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘నవోదయ’ పరీక్ష

టెక్కలి రూరల్: నవోదయ పాఠశాలల్లో చేరేందుకు శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలను కేంద్రాలుగా కేటాయించారు. ఉన్నత పాఠశాలలో 240 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 16 మంది గైర్హాజరయ్యారు. అలాగే బాలికోన్నత పాఠశాలలో 210 మందికి 12 మంది హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్లు వై.హరిబాబు, శోభారాణి తెలిపారు.

తక్షణసాయం అందజేత

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గ్రామానికి చెందిన కాస పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె వైఎస్సార్‌బీమా పాలసీ హోల్డర్ కావడంతో తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమె కుటుంబ సభ్యులకు స్థానిక నాయకుల ద్వారా శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ లండ రామలింగం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

వజ్రపుకొత్తూరు రూరల్: పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి బలోపేతం చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం సువ్వలరేవు, నగరంపల్లి, సీతాపురం, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి, బాతుపురం, గరుడబద్ర తదితర పాఠశాలలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థుల ప్రగతి కార్డులను అందజేశారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులకు జ్ఞాపికలను అందించారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులను గ్రామస్తులు సత్కరించారు.

నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

కంచిలి: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతోందని వ్యవసాయ సిబ్బంది అన్నారు. రైతులు వీటి సాగుపై దృష్టిసారించాలని సూచించారు. మండలపల్లి గ్రామంలో నవధాన్యాల సాగుతో చేకూరే ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు.
వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎస్‌డీపీ యశోద, వీఏఏ గంగరాజు, లోహిదాసు, కామరాజు పాల్గొన్నారు.

సమావేశంలో సమస్యల ప్రస్తావన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను ప్రస్తావించారు.పట్టణంలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రతినెల సమావేశాలు నిర్వహించడం ఎందుకని ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ కమిషనర్ ఎస్. రమేష్‌ను ప్రశ్నించారు. సమావేశంలో ఐదు అంశాలపై చర్చించి ఆమోదించారు. గతేడాది 14వ ఆర్థికసంఘం ద్వారా మున్సిపాలిటీకి రూ. 6.67 కోట్ల నిధులు కేటాయించగా వాటికి సంబంధించిన పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో రూ. 5.87 కోట్లును మున్సిపాలిటీకి సంబంధించి విద్యుత్ బిల్లులు చెల్లించగా.. మిగిలినవి రద్దు చేసినట్టు కమిషనర్ రమేష్ ప్రకటించగా కౌన్సిల్ సభ్యులు ఆశ్చర్యానికి గురయ్యారు.

నేడు విశ్వనాథం సంస్మరణ సభ

పలాస: మాజీ ఎంపీ కణితి విశ్వనాథం సంస్మరణ సభను ఆదివారం ఉదయం పది గంటలకు పలాసలోని తన స్వగృహంలో నిర్వహిస్తున్నట్టు అభిమానులు, కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు కాశీబుగ్గలో ద్విగళావధానం

పలాస: కాశీబుగ్గ పట్టణంలోని శ్రీగురుకుల విద్యాలయంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ద్విగళావధానం నిర్వహిస్తున్నట్టు లలిత కళారంజని అధ్యక్షుడు కె.చిన్నాచారి శనివారం ఓ ప్రకటనలోతెలిపారు. ఉత్తరాంధ్రలోనే మొదటి సారిగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి కోటబొమ్మాళికి చెందిన అవధాని సుసరాపు చంద్రశేఖరశర్మ, ఉర్లాం సంస్థానానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త బంకుపల్లి రమేష్ శర్మ, హిరమండలానికి చెందిన రంప సాయికుమార్ శర్మ పాల్గొంటారన్నారు. సాహితీ వేత్తలు, సాహిత్య ప్రియులు, కళాకారులు, విద్యావేత్తలు పాల్గొనాలని కోరారు.

నిస్వార్థ నాయకుడు కణితి


విశ్వనాథం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సోంపేట: నిస్వార్థమైన నాయకుడు మాజీ ఎంపీ కణితి విశ్వనాథం అని వక్తలు అన్నారు. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేశారని కొనియాడారు. పలాసపురం గ్రామంలో విశ్వనాథం సంతాప సభను శనివారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు తడక యశోద, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జోగారావు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి విశ్వనాథం చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో దుద్ది భారతి, కూర్మనాథ్ పాణిగ్రాహి, పాల్గొన్నారు.

వాహనాల వేలం


వేలం నిర్వహిస్తున్న ఎస్ఈబీ అధికారులు

ఇచ్ఛాపురం: వివిధ కేసుల్లో పట్టుబడిన 13 ద్విచక్ర వాహనాలను స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎస్ఈబీ అధికారులు శనివారం వేలం వేశారు. పలువురు వేలంలో వీటిని దక్కించుకోవడంతో 2,35,056 రూపాయల ఆదాయం చేకూరిందని ఎస్ఈబీ ఎస్సై కె.గురుమూర్తి తెలిపారు.

ఉదయ్‌కిరణ్‌కు 12,883 ర్యాంకు


ఉదయ్‌కిరణ్

కోటబొమ్మాళి: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కోటబొమ్మాళి పంచాయతీ విద్యుత్‌నగర్‌కు చెందిన రొక్కం ఉదయ్‌కిరణ్ జనరల్ కేటగిరీలో 12,883వ ర్యాంకు సాధించాడు. ఇతనికి 98.98 పర్సంట్ మార్కులు వచ్చాయి. తండ్రి రాంబాబు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కాగా తల్లి మాధవి గృహిణి.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● జెడ్పీ చైర్‌పర్సన్ విజయ


మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బేసిరామచంద్రాపురం గ్రామంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 95 శాతం నెరవేర్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ఏపీ ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల వినియోగంపై పాయితారి గ్రామంలో శనివారం వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కుందేశి లలితానాయక్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో పంటల దిగుబడి సాధించేందుకు ఔషధ వనరులతో తయారీ చేసిన సేంద్రియ ఎరువుల్నే వాడాలన్నారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పీఆర్పీ జాడు తులసయ్య ఖరీఫ్ ప్రణాళిక 2023-24 ప్రకృతి వ్యవసాయం విధానంలో వచ్చే ప్రయోజనాలు, లాభాలు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్.ప్రసాదరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు దీక్షిత్, సీసీ మోహననావు, వీవోఏ మోహని, ఐసీఆర్పీ కుమారీ పాల్గొన్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షపార్టీల నాయకులు

పలాస: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సీపీఎం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో పలాసలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి కాశీబుగ్గ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.తులసీదాసు మాట్లాడుతూ.. బీజేపీ సర్కార్ ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చ గొడుతోందని ఆరోపించారు. మరో పక్క దేశసంపదను అదాని, అంబానికి కట్టబెడుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ.. ప్రజలపై మోయలేనంతగా పన్నుల భారాన్ని వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, పలాస మండల నాయకులు ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, ఆర్.దిలీప్‌కుమార్, దుబ్బ భానుమతి, వెంకటరావు, సాంబమూర్తి, చాపర వేణు, టి.భాస్కరరావు, దేవేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రెండు గేదెలు మృతి


చనిపోయిన గేదెలను చూస్తున్న స్థానికులు

ఇచ్ఛాపురం రూరల్: విద్యుదాఘాతంతో రెండు గేదెలు ప్రాణాలు కోల్పోయాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. కీర్తిపురం గ్రామానికి చెందిన దుర్యోధన తన రెండు గేదెలను బీఎస్ఎన్ఎల్ టవర్‌కు ఎదురుగా ఉన్న పంట పొలంలోని శనివారం తీసుకెళ్లారు. అయితే విద్యుత్ తీగలు తెగి నేలపై పడడంతో వాటిపై అడుగులు వేసిన గేదెలు షాక్‌కు గురై మృతి చెందాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పశువైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. సుమారు రూ. లక్షన్నర విలువైన గేదెలు చనిపోవడంతో నష్టపోయామని బాధిత కుటుంబం రోదించింది.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేక్రమంలో బాలబాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. రాజపురంలోని ఏపీ మోడల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్ ఈశ్వరరావు స్కూల్ వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచివారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో నాయకులు కడియాల ప్రకాష్, సనపల జానకీరావు, రాంపత్ని చిట్టిబాబు, సత్యనారాయణపాడి, శ్రీరాములు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
● దిమిలాడలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’


లబ్ధిని తెలియజేస్తున్న దువ్వాడ శ్రీనివాస్

నందిగాం: సమస్యలను తక్షణం పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. దిమిలాడ గ్రామంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేకూరిన లబ్ధిని చదివి వినిపించి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.

ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు బొంగి హనుమంతురావు, బాలక మధు, దీర్ఘాసి క్రిష్ణారావు, యర్ర చక్రవర్తి, జడ్యాడ జయరాం, సైలాడ లావన్న, తమిరె దేవేంద్ర, తమిరె ఫాల్గుణరావు, బలరాం, లచ్చయ్య, మాదిన గోపాలక్రిష్ణ, సంతబొమ్మాళి వైస్ ఎంపీపీ నక్క భీమారావు, కె.లింగూడు సర్పంచ్ టి.నారాయణరావు, గేదెల జోగారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

నందిగాం: గొల్లూరు వద్ద వంశధార కాలువపై ఉన్న 43 ఏళ్ల పురాతన వంతెన కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తక్షణం వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కోరారు. కూలిన వంతెనను శనివారం పరిశీలించారు. కొండల ప్రాంత గ్రామాల ప్రజల రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని ఇరిగేషన్ డీఈ ఎ.రామక్రిష్ణతో, ఫోన్‌లో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కాంతిమతితో మాట్లాడారు.
వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో కూలిన వంతెన పక్కనే కొత్త వంతెన ఏర్పాటుకు కొంత మేర పనిచేసి విడిచిపెట్టి ఉన్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇరిగేషన్ ఏఈ అభిషేక్, ఆర్‌అండ్‌బీ జేఈ సతీష్, నాయకులు యర్ర చక్రవర్తి, జడ్యాడ జయరాం, తమిరె బలరాం, జీరు లక్ష్మణ్ రెడ్డి ఉన్నారు.